# పల్లవి

పల్లవి అనేది సినీతార పేరుకాదు. సంగీత కచేరీలో గాయకుడు, కొంతసేపు కచేరీజరిపి, తన ప్రతిభ చూపేందుకు, పాండితీ ప్రకర్ష తెలిపేందుకు ఒక కీర్తనపాడి, దానిలోని ఒక చిన్న భాగం తీసుకుని, దానిఆధారంతో చిత్రవిచిత్ర గతులలో స్వరాలు అవృత స్వరాలు, వేస్తూ రక్తికట్టిస్తూ ఆ చిన్న భాగాన్ని అందుకుంటాడు. చివరకి, మృదంగ విద్వాంసునికీ వాయువీనం వాయించే పక్క వాయిద్యగానికి అవకాశమిస్తాడు ముగ్గురూకలిసి లయలో తేడాలు వారుచూపించ దలచుకున్న చమత్కారాలుచూపిస్తూ పతాక సన్నివేశానికి తెప్పించి పల్లవి అందుకోగానే సభికుల కరతాళ ధ్వనులు వినిపిస్తాయి సభరక్తి గట్టిందని అంటారు.

ఈ గాయకునిపేరు సంగీతం జగన్మోహనరావు. అమ్మకు పుట్టిన ఆరుగురు సంగీతపాటకులేనా అన్నట్టు అందరూసంగీతంలోనే పేరు తెచ్చుకున్నారు. కర్నాటక సంగీతం, హిందుస్తానీ మ్యూజిక్, ఘజల్స్, పాప్‌మ్యూజిక్, జాజ్, జానపదగేయాలు లలిత సంగీత, బాలెడ్స్, బుర్రకథలు చెప్పటంలో నిష్టాతులైనారు. పెద్దాయన ఢిల్లీ దూర శ్రవణ కేంద్రంలో జాబ్ సంపాయించి సంగీత రూపక ప్రదర్శనకు అధిపతి అయినాడు. మరొక బిడ్డ జానపద గేయాలమీధ రిసెర్చిచేసి, 'ఆచార్య' బిరుదు తెచ్చుకున్నాడు.

హాలు నిండిపోయింది. అరున్నరకల్లా గాయకుడుకచేరీ ప్రారంభించాడు. రక్తికట్టే స్థాయికి వచ్చేప్పటికి యెనిమిదిన్నర అయింది. ఖరహరప్రియ రాగంలో రమా నీయెడా

ప్రేమరహితులకు, ప్రేమరుచి తెలుసునాఒ అని అందుకుని, గాయకప్రియ, కోకిలప్రియ రాగాలు కలిపి మాలికలాగా పాడుతూ పూర్తి చేసి పల్లవి అందుకున్నాడు.

సభికులలో సగ భాగంపైన స్త్రీలున్నారు. వారిలోమళ్ళా మూడొంతులు వయసొచ్చిన ఆడపిల్లలు, పెళ్ళి కెదిగిన వారూ వున్నారు.

జగన్మోహనరావు కచేరీఅని తెలియగానే చూడటానికి వచ్చేవారే చాలామంది వుంటారు. వినటానికిగాదు అందమైన వ్యక్తిని చూస్తే కొంతమందికి ఆనందం కలుగుతుంది. మరి కొందరికి యింపైనగానం వింటే మైమరవు కలుగుతుంది. గాయకుని కారెండూ వున్నాయి. అతని వయస్సు దేవతల వయస్సు. దేవతలంతా త్రిదశులే. కీర్తి సంపాయించటమే గాక, అడపా దడపా ప్లేబాక్ గాయకునిలాగా గూడా సంపాదిస్తున్నాడు. వేషధారణా ఆకర్షిస్తుంది. మనిషీఆయస్కాంతమే

'నిన్ను చదివిస్తానూ' నిసరిగమ, నిన్ను చదివిస్తానూ పనిసరిగమ" చదివిస్తానూ" దిగమగమప" యిస్తానూ. మప దనిగమపద, డబ్బిస్తానూ" అలాపాడుతూ, తన్మయత్వంతో కళ్ళుమూసుకుని, కుడిచేత్తో తాళం చూపుతూ, యడమచేయి గాలిలో తిప్పుతున్నాడు. నల్లని చిక్కని క్రాపూ, డైమండ్ తమ్మెట్లూ, చేతివేళ్ళకు డైమండ్ రింగ్స్, కుడిచేతికి సింహ తలాటమున్న బంగారు కడియం, సిల్కులాల్చీ. బంగారు బొత్తాలు డైమెండున్నవి, తెల్లని విశాలమైన నుదుటిమీద

ఉంగరాల జుట్టుపడి, గాయకుడు తలాడిస్తున్నప్పుడు తనూ ఆడుతున్నది మంచిముత్యాలలాగా చిరుచెమట. అత్తాకోడ లంచు పట్టు ధోవతీ, జరీఅంచులున్న పట్టుత్తరీయం, నిండైన విగ్రహాన్ని చూస్తున్నారు సభికులు.

అవృత స్వరాలయిపోయి, స్థాయీ స్వరాలమీద కల్పిత స్వరాలు వరుగెత్తుతున్నాయి. రిరిగ, గరిరిగ రిగరిరిగ", ఆడపిల్లలంటేయెంతో ముద్దూ. పా పా పా దతపా మపదదపా దపమపా, నా పేకాటకు కొంచెముంచుకుని అదాయమంతా యిచ్చేస్తానూ. సా సా సా నినిసాస్స. రిరిసాస్స గరిసాస అలాపాడుతూ తారస్తాయికివెళ్ళి, మోడరన్ గిమ్మిక్స్ చూపుతున్నాడు పక్క వాయిద్యగాళ్ళూ, మెళకువలూ, చాతుర్యం లయమార్పూ చూపుతూ అనుసరిస్తున్నారు స్వరాలూ అలా పనా కలిపిపాడి పల్లవి అందుకున్నాడు.

పంపేస్తానూ, ఆ. మా వాళ్ళను పంపేస్తానూ. అం. అని గొంతులోనే గుక్కపట్టి తానంలాగా వినిపిస్తూ, మా అమ్మను తో లేస్తానూ అ అ అ అ ఆ చూడటానికి వెళ్ళనూ. అలా తారస్థాయికి వెళ్ళి, మళ్ళా దిగి మంద్రస్థాయికెళ్ళి, పంచమం వరకూ వెళ్ళి, మళ్ళా దిగి షడ్జమం దగ్గరాపి కళ్ళు తెరిచాడు. పెద్దకళ్ళు నవ్వుతున్నాయి. సభంతా కరతాళ ధ్వనులతో నిండిపోయింది. కొంచెంసేపు మృదంగిస్టుకి తాళంవేస్తూ తల వూపాడు. తమ్మెట్లు మెరిసినై. వాయులీనం మీద తాని వినిపిస్తుంటే, తలూపుతూ మెచ్చుతున్నట్టు అభినయించాడు, మెళ్లో బంగారు గొలుసు మెరిసింది కచేరీముగిసింది. ఒక

రిద్దరు సభికులు వచ్చి తమకు నచ్చిన ఒకటి రెండు కీర్తనలు పాడమని అడిగి, విని కమలాఫలాలసంచీ దగ్గరగా వుంచిదణ్ణం పెట్టి వెళ్లారు. లైట్లు ధగధగ లాడుతుంటె ఫాన్లు తిరుగుతుంటే అంతా లేచారు. వేదికమీదివారూ లేచారు.

ఒకమ్మాయి ధైర్యంగా వచ్చి మెట్లెక్కి యెదురుగా నిలబడి దణ్ణంపెట్టి అడిగింది.

యెవరైనా నేర్చుకుంటామని అడిగితే సంగీతం నేర్పుతారా.

తప్పకుండా నేర్పుతాను. జీతం తీసుకోను, సంగీతం అమ్మను. ఆడపిల్లలకు చెప్పటం మరీయిష్టం. అయితే అంతా నేను చెప్పినట్లే వినాలి. మధ్యలో నన్ను వదిలేసి, మరొక పాటగాని ఎద్దకు వెళ్లరాదు. యెలా నేర్పాలో నాకు తెలుసు, నేర్చుకునేవారికి తెలియదు. అంతమాత్రాన నిరుత్సాహ పడరాదు. త్యాగరాజస్వామి అంతే. తిండిగూడా తానే పెడుతూ, శ్రద్ధగా నేర్పి విద్వాంసులను తయారుచేసేవారు.

మీరూ ఆ పని చేస్తారా?

ఆ, నాకేం బాధలేదు,

అడిషన్‌కి పంపిస్తారా?

తప్పకుండా వెళ్లచ్చు, మూడేళ్ళలో పర్‌ఫెక్ట్ చేస్తాను. నేను సర్టిఫై చేయనిదీ ఆడిషన్‌కి రానివ్వరు. ఇంతవరకూ నా శిష్యులెవ్వరూ ఫెయిల్‌గాలేదు. ఒకరిద్దరు, నేపధ్యగాయకులుగా గూడా వెళ్లారు. దయగాచూస్తూ అన్నాడు.

నిగర్వి స్నేహశీలి అనుకున్నదా అమ్మాయి. ఇంకా ఏమడిగేదో గాని, ఆమె స్నేహితురాళ్లు వచ్చి మోచేత్తో పొడవనూ, పోదాంరా చాల్లే. అన్నట్లు చేయిపట్టుకు లాగనూ, గాయకుని చూసి మొహం చిట్లించనూ చేశారు. ఆ అమ్మాయి చెలికత్తెలతో వెళ్లిపోయింది. వారు వెళ్ళినవేపే చూశాడు గాయకుడు.

గున్నమావి తోటలోన గువ్వయొకటి గూడుకట్టి సరసుడౌ వసంతు రాకకొరకు తమిని చూచుచుండె. అనే లలిత గేయం సన్నని గొంతుతో పాడుకూ మెట్లుదిగాడు. పక్క వాయిద్య గాళ్ళకూ వచ్చాగేయం. నవ్వుకుంటూ వారూదిగారు.

## 2

వచ్చె చైత్రమాసమూ వాసంత విలాసమూ అని సన్నగా పాడుకుంటూ కారులో పోతున్నాడు గాయకుడు. రోడ్డుమీద చూస్తే మేటింగ్ సీజనని గుర్తుచేశాయి పశుపక్ష్యాదులు బస్ స్టాప్ మీదుగా పోతున్నాదికారు.

అపేయ్! అని అరిచాడు గాయకుడు. చోదకుడు బలరామ్ సడన్ బ్రేక్‌వేసి ఆపేశాడు.

నేర్చుకుంటానని వుబలాటపడిన అమ్మాయి, బస్‌స్టాప్‌లో వున్నది బస్‌కోసం చూస్తూ. తెలుగువారపత్రిక తిరగేస్తున్నది కారుదిగివచ్చి యెదురుగా నిలబడ్డాడు గాయకుడు. పత్రిక మీదచూపు అతనిమీదికి తిప్పిందా అమ్మాయి.

యేం రాలేదేం? సంగీతం నేర్చుకుంటానంటిరే?

మీరు సీనియర్సుకేగాని, బిగినర్స్‌కి చెప్పరని, చెప్తానని మోసగించి, వంటింట్లో బిగిస్తారని నా స్నేహితురాళ్ళు చెప్పారు. అనుభవంమీదే చెప్పారుట. అన్నది.

వాళ్ళు వేరే రేడియో ఆర్టిస్ట్ దగ్గర నేర్చుకోటానికి వెళ్లారు వాడుగానీ బాగా మోసగించడు. నాదగ్గర బిగినే చేయలేదసలు అదంతా జెలసీ మహత్యం. నీ కెంతమంచి గురువందాడోనని జెలసీ, నేను సరళీస్వరాల దగ్గరనుంచీ, ఆదితాళం దగ్గర్నుంచీ నేర్పుతాను. సీనియర్సుకి నేర్పక్కర్లేదు. నేను పాడుతుంటె విని నేర్చుకుంటారు. కొత్తసంగతులు, కొత్తరకం పల్లవులూ నేరుస్తారు. మీయింటి కొచ్చె నేర్పుదామంటే మీ యడ్రసివ్వ లేదు నువ్వు. డిజపాయింట్ అయాను.

మా యింటికి రాక్కర్లేదు, చాలా దూరం గూడాను, సందులు గొందులు మారాలి. మరో ఫ్రెండ్ పర్‌ఫెక్ట్ చేసుకుందామని మీ విద్యాపీఠానికి వస్తే, మీరు అందలేదుట, సారీ సార్! మీకు డిజపాయింట్‌మెంట్ కలిగించాను.

"నీ ఫ్రెండ్ పేరేమిటి? అబద్ధమాడింది, నామీద నింద వేసింది. నేను చాలా మంచివాడిని. కారాపి దిగలేదూ?"

"దిగారనుకోండి, ఇంకో ఫ్రెండ్ చెప్పింది. ఆమె సీనియరే, ఆమె మీ వద్దకు వస్తే, వేరే మతస్థుడైన శిష్యునకప్పగించారుట మీరు, స్వయంగా యేమీ చెప్పలేదుట, ఆ శిష్యుడు సంగీతమేమోగానీ, నా ఫ్రెండ్ మొహంమీదినించి కళ్ళు తీయనే

లేదుట, నా గతీ అంతేనేమో నని భయంవేసింది" అన్నది పత్రిక చూస్తూ.

నీ సంగీతానికి పుటుట్లో సంధి కొట్టిందే అని తీయగా నవ్వాడు.

"అదీ నిందే మిస్టర్ అన్నోన్! యెవరేం చెప్పినా నమ్ము తావన్న మాట, నీ వుబలాటానికి అడ్డుకట్ట వేశారు వాళ్ళు. అది మంచి పనిగాదు. నువ్వు తప్పక రావాలి, నేను మిడ్డే మీల్సు నైట్ క్లాసెస్ స్టార్ట్ చేశాను, అక్కడే నీకు తిండీ తీర్థం నిద్రా అందుతాయి. 'మీరు త్యాగరాజస్వామిలాగా తిండిపెట్టి నేర్పు తారా?' అనడిగితివే, నేనబద్ధమాడను. నువ్వు తప్పక రా, బస్సుకు డబ్బులిస్తాను. కార్లో దింపుతారా" అన్నాడు దయగా ఆ అమ్మాయి రానని తల అడ్డంగా తిప్పింది.

"నీ యిష్టం, పోనీ బస్సులోనే రా" అని నోటు అందిస్తే, అనుమానిస్తూనే అందుకున్నదా అమ్మాయి. గాయకుడు కారులో దూరాడు. కారులో రాజాలాగా వెళ్ళిపోతున్న గాయ కుడా అమ్మాయికి చిలక రథమెక్కి వెళ్తున్న మన్మధునిలాగా తోచాడు. లేటుగా ఆమె బస్సు వచ్చింది.

3

మొదటి అమ్మాయికి బాగా చెప్పటమేగాక, మిడ్డేమీల్సు గూడా యేర్పాటు చేశాడని, సంగీతమందాసక్తి గలవారికి తెలిసిపోయింది. మునుపు సత్రంలో అన్నం తని, రాజావారి పాఠశాలలో సంగీతం నేర్చేవాడుట. ఇప్పుడా బాధలేదు.

మొదటమ్మాయి ఆరునెలలకే కీర్తనలూ, కృతులూ నేర్వ గలిగి తానంలో కొచ్చేసిందిట. తామూ త్వరగా పూర్తి చేసుకుని, ఆడిషన్‌కి వెళ్ళాలని, ఆత్రంగా చాలామంది పోగైనారు. ఒక యాడాది గడిచేవ్వటికి, స్ట్రెంగ్త్ పడిపోయింది. వంటవాడు మానేశాడు, మరొకడు రాలేదు. చాలామందికి తెడ్డు చేతికొచ్చింది, వంట బాగా రాదు, భోజనం పడలేదు, నిష్క్రమించారు. మరికొందరు జంత్రీ వాయిద్యాలు మోడరన్ విండ్ యిన్‌స్టుమెంట్సు నేర్వాలని మరో విద్యా పీఠానికి వెళ్ళిపోయారు. మరికొందరు గడుగ్గాయిలు.

వీడి తరహా చూస్తే, ఆడిషన్ లేదేం లేదు. అందర్నీ లొంగదీసి ఆడిస్తున్నాడు. బాగా పని చేయిస్తున్నాడు. చేసేవాళ్ళున్నారు గదా వుచితంగానని, వీడి బంధువులంతా వస్తున్నారు. వీటికి చేస్తాంగానీ, వీడి బంధువులకెందుకు చేయాలీః క్రీత దాసులమాః అని చెక్కేశారు.

"మరీ మంచిది, చెత్త యెగిరిపోవటమే మేలు. శ్రద్ధయేదీః సాధనేదీః రాత్రిళ్ళు మేలుకోలేరుట యెనిమిదిన్నరకే నిద్రకొరుగుతారు. అదేమని అడిగితే,

'మీకోసం ఆడామగా చాలామంది వస్తున్నారు. వాళ్ళను పంపి మీరు నేర్పటానికి వచ్చేప్పటికి కోడి కూస్తున్నది. మీది విశ్వామిత్రుని గోత్రంలాగా వున్నది' అని నవ్వేస్తారు.

మొదటి శిష్య పరమాణువే ఆశతో నేరుస్తున్నది. తానం అందంగా పాడుతుంది, గజతానం, కచ్ఛపతానం, మండూక తానం వినిపిస్తే పండితులు తలలూపారు.

"తీయని గొంతు, ఒదుగు గూడా వున్నది గొంతులో, నీ శిష్యురాలు బాల గంధర్వలాగా పాడుతున్నది. 'రవ' యెంత బాగా పలికిస్తున్నదీ? తప్పక ఉత్తీర్ణురాలౌతుంది"అని దీవించి వెళ్ళేవారు.

పల్లవి పాడటం నేర్పుతూ, విదేశాలలో ప్రోగ్రామ్ లివ్వటానికి వెళ్ళాడు గాయకుడు. న్యూయార్క్, లాసేంజిల్సు కాలిఫోర్నియా, ఆఫ్రికా, పారిస్, బెర్లిన్ మొత్తం పన్నెండు స్టేషన్సులో కచేరీ చేసి వస్తాడు. పల్లవి ప్రాక్టీస్ చేస్తుండగా కొడుకును కనాల్సి వచ్చింది. ఫోన్ చేద్దామంటే యే స్టేషన్లో వున్నాడో తెలియదు. సాధన చేస్తూనే వున్నది.

గాయకుడు వూడిపడ్డాడు, వుయ్యాల్లో పిల్లాడిని చూశాడు. పల్లవి అందుకోటం నేర్పుతూ, "నేను నిన్ను పిల్లల్ని గనటానికి రమ్మని అహ్వానించానా?" అని స్వరాలు వేసి గడగడా పాడాడు. అందుకోవాలని చూసింది ఆడిషన్‌కి తయారుకమ్మన్నాడు. ఎలక్ట్రికల్ రికార్డింగ్ జరుగుతుంది. ఢిల్లీ పోవాలి. ఇరవై అయిదు నిమిషాల్లో విద్వత్తు చూపాలి. రాగం తానం పల్లవీ, కీర్తనా పర్‌ఫెక్ట్‌గా పాడాలి. తప్పు పోయిందా రికార్డవుతుంది. భయపడిపోయింది, ఢిల్లీ తీసికెళ్ళాడు గానీ తప్పింది. పుణ్యకాలం గడిచిపోయింది, గొంతు జీరబోయింది అన్నాడు. కాని జాలిపడి పల్లవి పాడటం శ్రద్ధగా నేర్పసాగాడు.

నువ్వు నే చెప్పినట్టు వినలేదూ. గరిగమ పిల్లల్ని కనగూడదని చెప్పానూ. పనిప, మ పనిప గమ పనిప. కెరీర్

ముఖ్యమని చెప్పాను. పపప దపమ పమ పా ప పా ప దపపాప పా పా పా, రిగమ గదపా గపమగమపా, నిదప మమ పా. మొదటి ఒప్పందం చేసుకున్నాము సా సా సా నినిపాప గరిసాస నీవు నీసంపాదనమీద నిలబడాలని ఆశించాను. మూర్ఛ నావిస్తారం నేర్పుతూ, అందుకో గలుగు తున్నదా లేదా గమనించాడు.

గాయకుని అంటిపెట్టుకుని, మర్యాదస్తురాలైన శిష్యు రాలున్నదని, గాయకుని మిత్రులూ, చుట్టాలూ, ఆత్మీయులూ అతిథీ అభ్యాగతీ వస్తూ వుండేవారు.

యేజ్ టార్ గా లేదని యింకా నేరుస్తూనే వున్నది. ఇంప్రెల్ చేసుకుని రండి అని శ్రీ ముఖాలందిన లేడీస్, ఎ క్లాస్‌లోకిపోవా లనే తాపత్రియంగల, మధ్యవయస్కు రాళ్లూ చేరారు గాయ కుని వద్ద,

అందులో ఒకామెని అడిగింది మొదటి అమ్మాయి,

అదేం పల్లవీ. మన యిష్టంమీద పిల్లలు పుడుతారా?

గ్రేట్ ఆర్టిస్ట్స్ అలాగే పాడతారమ్మాయ్. రోతికా అని గొప్ప పాలరాతిశిల్పి, రోజెట్టా అనే చక్కని అమ్మాయి లాండ్రెస్ మోడల్‌గా కుదిరింది. అది కడుపురాగానే భయపడిపోయింది. పిల్లల్ని కనమని పెట్టుకున్నానా అందుకేనా నీకు గంటకింతా అని చెల్లిస్తున్నదీ? అని వురిమాడు. వాడే తండ్రి. ఆర్టని గౌరవంగా చూస్తూ తక్కిన విషయాలను అల్పంగా చూస్తారు ఆర్టిస్ట్స్. కథకే గురువూ గొప్ప నాట్యకర్తా అంతే. అని నవ్వింది మధ్య వయస్కురాలు.

కథా నిలయం
52334
శ్రీకాకుళం



## 4

ఇప్పుడు గాయకుడు మిడ్డేమీల్సు గాక, సప్పర్ గూడా యేర్పాటు చేశాడు. కచేరీల కెళ్తాడు, ఎగ్జామినర్ గా వెళ్తాడు. సెలెక్ట్ కమిటీ మెంబరయినాడు. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైయిర్మ నయినాడు. దూరశ్రవణంలో గంటన్నర ప్రోగ్రామిస్తాడు. దూరదర్శిని యూనిట్ వచ్చి అరేంజ్ చేసి పాడించి, స్టీరియో మీదికి డిస్క్ తయారు చేసుకుని వెళ్ళిపోతారు. గాయకుడు ఫేమస్ అయినాడు. నికరాదాయం వస్తున్నది. తన శిష్యు లకు దూరదర్శినిమీద కనబడే అవకాశ మిప్పించగలడు. ఇప్పి స్తాడు.

మొదటి అమ్మాయి అశాచావక, దూరదర్శిని మీదన్నా బృందగానంలోనన్నా కనబడనా. పనికిరానా అనుకుంటూ శిష్యరికం చేస్తూనే ఉన్నది.

రాత్రిపదకొండున్నకి, పల్లవివేసి పాడటం నేర్పుతున్నా డు గాయకుడు. అందుకో గలిగినంత అందుకుంటున్నా. అం దుకో లేనప్పుడు కళ్ళంపగించి వింటున్నది.

వద్దంటే అనవసరంగా కన్నావుగనక నా యిన్ఫుయన్సు వుపయోగించి చదివించనూ. స ని స రి గ మ నేను మంచి వాడిని గనక చదివించనూ, ప రి గ రి గ మ, గ మ ప మ ప ద నా అంతమంచివాడున్నాడా? స ని ద ప మ, రి స ని ద ప మ. గ మ ప ద ని స. వాళ్ళ పెళ్ళిళ్లు వాళ్లే చేసుకోవాలి. రి రి గ, గ రి రి గ ద ని ప స. సా సా సా. ని ని సా స వ ని సా స రి రి సా స, నువ్వు అందరిని చూసి వస్తూ వుం

డాలీ. రి రి రి రి, గ గ గ గ, ప ప, ద గ ప ద స రిగాగాగా మా వాళ్ళతో కలుపుగోలు తనంగా వుండాలీ. గ ప ధ స రి గా గా గా పూసుకు తిరగాలీ గ ప ద స రి గా గా గా పూసుకు తిరగాలీ. వాళ్లేయేదో మాచ్‌చూసి మూడుముళ్లూ చౌకగా వేయిస్తారూ. మ గ గ మ ప గ గ మ. ని స రి గ మ ఇపుడు నిన్నెవరూ యేమనరూ. నేను ఫేమస్ అయినానుగాదాచమ్‌డా లూడ దీస్తానూ, స్వరాలు విచిత్రగతిలో వేస్తు స్వరలోపంవల్ల రాగం మారుస్తు, రాగమూ పల్లవీ స్వరాలూకలగా పులగంచేస్తు తారస్థాయిలోకిపోయి అందుకోటం అసాధ్యం అయేట్లు పాడుతున్నాడు గాయకుడు. మరీ యెక్కడికీ పోకండా, పా పా పా సా సా సా అంతా నా నెత్తిన రుద్దాలని చూస్తున్నావు. నీవేమీ చేయ వై పాయె. నినిసాసా పనిసాసా. అవచ్చేవాళ్లు నన్ను పీక్కుతింటారూ, నేను చేయలేనూ, హాయంగా వుంటానూ, చేయగలిగిన మంచతాచేస్తానూ. అలాచమత్కారంగా, ప్రయోగాలు చూపుతూ. రాగమాలికలాగా నోమనీ, మనీ, లేదు మనీ, మనీ, నిన్నిన్ని సనిన్ని పనిన్ని ఫ్లూట్‌లాగా, వీణలాగా మృదంగంలాగ కంఠంలో పలికిస్తున్నాడు గాయకుడు. అవన్ని అందుకోలేక, పలికించలేక, మాలిక అనుసరించలేక యేరాగమో తెలియక, అసమర్థు రాలై నేలమీద వొరిగి నిద్రపోయింది స్టూడెంట్. గాయకుడు తన్మయత్వంలోపాడుతూనే వున్నాడు.

## 5

నే నానాడే చెప్పానోయ్!— అ గాయకుడు వంచకుడు. పాటా నేర్పడు. పల్లవీ నేర్పడు. కిచెన్‌లో వుద్యోగమిస్తాడు తప్పించుకోలేవు. అంటే విన్నావుగాదు. వాడి కళ్ళలో నవ్వు

చూసే వాడెంత మోసగాడో గ్రహించవచ్చు. చైనీస్ ఫిలాస ఫర్ కంగ్ ఫ్యూషియస్ అన్నాడు. లుకెట్ ది ఫ్యూపిల్ పాటెం త మధురంగా వుంటుందో, మాటలంతకంటె తీయగా ఉంటాయి ఆ మాటల్లో మాదకద్రవ్యం కలుపుతాడు. ఆ డ్రగ్‌కి అలవాటు పడి దాసులమవుతాము, తప్పించుకు రావాలనివున్నా రాలేము. నీకు ముందు శిష్యరికం చేసిన వాళ్ళ ద్వారా నాకిదంతా తెలి సింది. నీ అమాయకత్వం ఆనెప్టి వుబలాటం చూసి, తప్పిం చాలని చూశాగాని చాతగాలేదు. చివరికా గాయకుడందుకున్న పల్లవి యేమిటి? చిత్రవిచిత్ర గతులతో స్వరాలు వేస్తు, ప్రయో గాలు వినిపిస్తూ, ప్రస్తారంచూపిస్తు, అందుకున్న పల్లవియేమిటి? అనడిగింది యవ్వనం జారిన ఓల్డ్ స్టూడెంట్ తనకు ప్రోగ్రా మిచ్చే అవకాశమే రాలేదని నిరాశపడి వచ్చేసిందామె.

మొదటి అమ్మాయి వడలిన పూవులాగానవ్వి, మావాళ్ళ నాశ్రయించుకుని వుండాలి. వాళ్ళు వుపకారంతప్పితే అపకారం తలపెట్టరూ. యెవరి నెత్తినా చేయి పెట్టరూ! అని పల్లవి అందు కున్నాడు. దాంతోనాకు సంగీతజ్ఞానం కలిగింది. అన్నది.

నీ కేమైనా పల్లవి చాతైందా?

ఆ కళ్యాణి రాగం "విడిచి సుఖింపవే మనసా!" స్వరాలు వేస్తూ తాళం వేసింది.

— ० —